

వాసంతి కుటుంబాన్ని ఆదుకుంటాం



● నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి ఫరూక్

● సమాజం తలదించుకునే ఘటన : బీసీ ● చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు ● రూ.10 లక్షల పరిహారం పంపిణీ

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 19: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ముచ్చుమర్రి ఘటనపై మంత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వాసంతి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన వాసంతి కుటుంబాన్ని శుక్రవారం మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 లక్షల పరిహారం చెక్కును చిన్నారి తల్లిదండ్రులు చిన్న మద్దిలేటి, సుజాతమ్మలకు అందజేశారు. మంత్రులతో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ జరగకూడని సంఘటన జరిగిందని, బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన వారు కూడా మైనర్లేనని వారి వెనుక వారి కుటుంబసభ్యులు ఉన్నారన్నారు. వారి వెనుక కూడా ఎంతటి పెద్దవారున్నా కఠినంగా శిక్షిస్తామన్నారు. మృతదేహం గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. సంఘటన జరిగిన మరుసటి రోజు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై ఆరా తీస్తున్నారని, మృతదేహం లభ్యమయ్యాక వచ్చి కుటుంబాన్ని పరామర్శిద్దామనుకున్నాం.. కానీ 13 రోజులైన మృతదేహం లభించకపోవడం దురదృష్టకరమన్నారు. నూతన ఎస్పీ ఈ కేసును విచారణ పూర్తి చేసి దోషులకు కఠినమైన శిక్ష పడేలా చేస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ఉన్న ఇద్దరు పిల్లలు జ్యోతి, మహేష్ బాబుల విద్యకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా కుటుంబ పోషణ కోసం చిన్నారి తల్లి సుజాతమ్మకు ఏదైనా ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ రాజకుమారిని ఆదేశించామన్నారు.

ట్యాబ్‌ల వల్లే యువత చెడిపోతుంది

గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లవల్లే విద్యార్థులు చెడిపోతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన శిక్షలు పడే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. వాటి హిస్టరీ చూస్తే విద్యార్థులు చూస్తున్న కంటెంట్ ఏమిటో అర్థమవుతోంది. విద్యార్థులను ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు, గంజాయికి జగన్ ప్రభుత్వం అలవాటు చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి అమ్మకానికి చెక్ పెట్టారన్నారు. వాసంతి మృతదేహం లభించేంత వరకు ఊరిలోనే ఉంటా. చిన్నారి కుటుంబానికి మా ప్రభుత్వం అండగా ఉంటుంది.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

యావత్ సమాజం తలవంచుకునే ఘటన

వాసంతి ఘటన యావత్ సమాజం తలవంచుకునే విధంగా ఉంది. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తే గత ఐదేళ్లలో గంజాయికి అలవాటు పడ్డ యువత తప్పుదోవ పట్టింది. చేసిన పాపాల నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా మరొకరు చేయాలంటే భయపడే విధంగా కఠినంగా శిక్ష పడేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారు. అత్యాచారం చేసి, హత్య చేయడమే కాకుండా మృతదేహాన్ని కూడా తల్లిదండ్రులు కనీసం కడచూపునకు నోచుకోకుండా చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తాం. ఘటన జరిగిన రోజు నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోంది.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి



వాసంతి తల్లిని ఓదార్చుత ున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు

గళమెత్తారు..

జడ్పీ సమావేశంలో వాణి వినిపించిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి జిల్లాకు కీలకమైన జడ్పీ సమావేశం శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన కర్నూలు జిల్లాలో జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చజరిగింది. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వాణి విపించారు.

తప్పుడు లెక్కలతో మభ్యపెడుతున్నారు



జల్‌జీవన్ మిషన్ పనులు 90 శాతం పూర్తయ్యాయని తప్పుడు లెక్కలతో మభ్య పెడుతున్నారు. 30 శాతం కూడా పూర్తి కాలేదు. ఎల్‌కే తాండ పైపులైన్ పగిలిపోతే మరమ్మతులు కూడా చేయలేదు. వెలుగోడు రిజర్వాయరు పక్కనే అదే గ్రామానికి తాగునీరు అందలేదు. మోటర్లు ఏర్పాటు చేయకుండానే నీళ్లు ఇచ్చామని అంటున్నారు. ప్రజలను మభ్య పెడుతున్నారు.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

వైసీపీ నేతల ఆదాయానికి జీఎన్ఎస్ఎస్ లైనింగ్



గత టీడీపీ ప్రభుత్వంలో గాలేరు నగరి ప్రాజెక్టు పూర్తి చేశాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ధనాపేక్షతో జీఎన్ఎస్ఎస్ లైనింగ్ చేపట్టింది. భూగర్భ జలాలు అడుగంటేలా గ్రౌండ్ లెవల్‌లో సీసీ లైనింగ్ ఎవరైనా చేస్తారా..? ఆ ప్రతిపాదనలు ఎవరు తయారు చేశారు. నంద్యాల జిల్లాలో 90 శాతం జల్‌జీవన్ మిషన్ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయి. వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద కుళాయి పైపులు ఉన్నాయి. విచారణ చేస్తే ఆధారాలు ఇస్తాం.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి

నంద్యాలకు మరో అదనపు ఎస్ఎస్ ట్యాంక్



జనాభా పెరగడంతో నంద్యాల పట్టణానికి అదనపు ఎస్ఎస్ ట్యాంక్ అవసరం ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. గోరుకల్లు జలాశయం నుంచి నీటిని తీసుకునేలా ప్లాన్ చేశాం. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి.

- ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి

సుంకేశ్వరి తరహా సమస్య ఎక్కడా రాకూడదు



సుంకేశ్వరి గ్రామంలో తాగునీరు కలుషితం కావడంతో అతిసారం ప్రబలి ఎంతో మంది అస్వస్థతకు గురయ్యారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తారా..? తాగునీరు కలుషితమయ్యాయా..? ఏ గ్రామంలో కూడా ఇలాంటి పరిస్థితి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- టీజీ భరత్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి

బోగస్ కౌలు రైతుల పేరిట నిధులు స్వాహా



గడివేముల మండలం కరిమద్దల గ్రామంలో వైసీపీ నాయకులు కొందరు బోగస్ కౌలు రైతులు పేర్లు నమోదు చేసి రైతు భరోసా నిధులు స్వాహా చేశారు. ఇది పెద్ద అవినీతి కుంభకోణం. దీనిపై విచారణ చేయాలి. ఇంటింటి కుళాయి పేరిట జల్‌జీవన్ మిషన్ నిధులు వైసీపీ నాయకులు స్వాహా చేశారు. రూ.36 లక్షల నిధులతో చేపట్టి తాగునీటి పనులు నాసిరకంగా చేయడం వల్ల తాగునీరు అందడం లేదు.

- గౌరు చరిత, పాణ్యం ఎమ్మెల్యే

గుమ్మడాపురం ఎస్ఎస్ ట్యాంక్‌పై ఎందుకు నిర్లక్ష్యం



గుమ్మడాపురం ఎస్ఎస్ ట్యాంక్ గత టీడీపీ ప్రభుత్వంలో 60 శాతం పూర్తి చేస్తే.. వైసీపీ ప్రభుత్వంలో 40 శాతం ఎందుకు పూర్తి చేయలేదు. హంద్రీనీవా కాల్వ విస్తరణ, అలగనూరు రిజర్వాయర్ టెండర్లు, మెఘా కంపెనీకి ఇచ్చిన నిధులు వివరాలు ఇవ్వండి. కొత్తపల్లి మండలం జానాలగూడెం సహా వివిధ చెంచుగూడేలకు విద్యుత్ లైన్ వేయాలి.

- జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే



వివరాలు 7లో..

ఖరీఫ్ రైతులకు సాగునీరు

● ఎమ్మెల్యేలతో కలసి నియోజకవర్గాల వారిగా సమీక్షిస్తా-మంత్రి టీజీ భరత్

● ఐఏబీ సమావేశంలో తీర్మానం

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 19:: ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా రైతులకు సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో కలెక్టరు పి. రంజిత్ బాషా అధ్యక్షతన జిల్లా సాగు నీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నియోజకవర్గాలవారిగా ప్రాజెక్టుల స్థితిగతులపై త్వరలో ఎమ్మెల్యేలతో కలసి సమీక్ష నిర్వహించి.. అవసరమైన నిధుల కోసం సీఎం చంద్రబాబుకు నివేదికలు పంపిస్తామని అన్నారు. తుంగభద్ర జలాశయంలో 55.97 టీఎంసీలు వరద చేరడంతో ఎల్లెల్సీ కాలువ ఆయకట్టుకు సాగునీరు ఎప్పుడు ఇస్తారని రైతులు డిమాండ్ చేస్తుండడంతో.. ఐఏబీ సమావేశం నిర్వహించారు. సాగునీరు, వివిధ నీటి వనరుల మరమ్మతులు, నీటి లభ్యత తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ బి. రంజిత్‌బాషా మాట్లాడుతూ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని అన్నారు. 4-5 ఎకరాల్లో చిన్నపాటి చెరువులు తవ్వి సాగు, తాగునీటి సమస్య తీర్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ చెరువులు కబ్జాకు గురయ్యాయని, కబ్జాదారుల నుంచి చెరువులకు విముక్తి కల్పించాని అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ రిజర్వాయర్ పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మునగాల లిఫ్ట్ మరమ్మతులు చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కల్లూరు మండలంలో నాలుగు చెరువుకు హంద్రీనీవా నీటిని నింపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. ఇగిరేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లెల్సీ కింద ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సుంకేసుల గేట్లు మరమ్మతులు లేక తుప్పు పట్టాయని, మరమ్మతులు చేయాలంటే కర్నూలు నగరానికి తాగునీటి నిల్వ ఇబ్బందిగా మారిందని అన్నారు. హంద్రీనీవా ఎస్ఈ రాంగోపాల్ మాట్లాడుతూ ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి రూ.33 కోట్లు విద్యుత్తు బిల్లు వస్తుందని వివరించగా.. అది ప్రభుత్వం చూసుకుంటుందని మంత్రి టీజీ భరత్ వివరించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, అలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌పై నిఘా

● ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

● కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

● బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు, జూలై 19: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల మీద పటిష్ట నిఘా ఏర్పాట్లు చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఉదయం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఏఆర్ పోలీసు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డీఐజీకి ఆశీస్సులు అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు ఎస్పీ జి. బిందుమాధవ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కడప ఎస్పీ వి. హర్షవర్దన్‌రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐజీ ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డీఐజీగా రాయలసీమకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

డీఐజీ గురించి: ● స్వగ్రామం - పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం

● 2009లో సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు

● అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, ఖాజీపేట పార్వతీపురం, వరంగల్, విజయనగరం జిల్లాలో ఓఎస్డీగా పని చేశారు. విశాఖపట్నం రూరల్ ఎస్పీగా, విజయవాడ సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీగా, కాకినాడ సీ-పోర్టు డైరెక్టర్‌గా, ప్రకాశం జిల్లా ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎస్పీగా, విశాఖపట్నం 16 బెటాలియన్ కమాండెంట్‌గా, ఆక్టోపస్, పోలీస్ ట్రాన్స్ ఆర్గనైజేషన్‌లలో ఎస్పీగా పని చేశారు.

● ఇటీవల జరిగిన రాష్ట్ర సాధారణ ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గ్రేహౌండ్స్‌లో డీఐజీగా పని చేస్తూ బదిలీపై కర్నూలు రేంజ్ డీఐజీగా ఆయన బాధ్యతలు చేపట్టారు.



డీఐజీని కలిసిన నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కర్నూలు రేంజ్ డీఐజీని కలిసిన ఎస్పీ

నంద్యాల క్రైం: కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీని కలిసి పూల మొక్క అందజేశారు. నంద్యాల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిశారు.

పరిష్కారాల్లేని సమీక్షలెందుకు?

● జడ్పీ సమీక్షా సమావేశంపై మంత్రి భరత్

● ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ స్కీమ్‌లకు మెయింటెనెన్స్ లేదు

● స్కీముల్లో స్కామ్‌లపై విచారణ జరిపిస్తాం- కేఈ శ్యామ్‌బాబు

● వైసీపీ హయాంలోలాగే అజెండా లేకుండా రమ్మంటున్నారు- గౌరుచరిత

కర్నూలు(అర్బన్), జూలై 19: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పరిష్కారాలేవీ లేనప్పుడు సమీక్ష వల్ల సమయం వృథా తప్ప ఒరిగేదేమీ లేదని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, గౌరుచరిత, బొగ్గుల దస్తగిరి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వై. నాగేశ్వరరావు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో కాలంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ స్కీమ్‌ల మెయింటెనెన్స్ కల్పించకపోవడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహంతో డ్యామ్‌లకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఐఏబీ సమావేశంలో తుంగభద్ర డ్యామ్ నుంచి 60 టీఎంసీ నీటిని విడుదల చేయాలని కర్నాటకను కోరేందుకు కలెక్టర్, అధికారులతో కలిసి వెళ్లాలని నిర్ణయిస్తామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు మాట్లాడుతూ 2017లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి జిల్లాలో 68 చెరువులు మంజూరు చేయించి 70 శాతం పనులు పూర్తిచేయించారని, వైసీపీ ప్రభుత్వంలో ఆ పనులు అక్కడే నిలిచిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పనులు చేయకపోగా ఆర్‌డబ్ల్యూస్ స్కీమ్‌లు అన్ని డిఫాల్ట్ అయ్యాయని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. అయితే నిర్మాణాలు జరిగినట్లు చూపి నిధులు కాజేశారని అన్నారు. దీనిపై విచారణ జరిపించి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ హంద్రీ నీవా ద్వారా నీటిని ఓర్వకల్లు మండలానికి మళ్లించాలని, ఇరిగేషన్‌పై నంద్యాల, కర్నూలు జిల్లాల అధికారులు సంయుక్తంగా పని చేసి పాణ్యం నియోజవర్గంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, వేదవతి తదితర పనులకు సంబంధించి ఒక రెఫరెండమ్‌తో చంద్రబాబును కలిసి నివేదిస్తామని అన్నారు. డీఎంఆర్‌డీ క్రిష్ణా రివర్స్ బోర్డులను కర్నూలులో ఏర్పాటు చేసేందుకు కోరదామన్నారు. ఈ సమావేశంలో షేక్షావలి, హనుమంతరావుచౌదరి, బేతం క్రిష్టుడు, ఎల్లప్ప పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



జల్ జీవన్ అక్రమాలు నిగ్గుతేల్చండి





వేదికపై ఆశీనులైన మంత్రులు, అధికారులు

- వాడివేడిగా సాగిన జడ్పీ సర్వసభ్య సమావేశం
- కాకి లెక్కలు చెబుతున్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఆగ్రహం
- సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపణ
- కర్నూలులోనే కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానం
- గుండ్రేవుల జలాశయం నిర్మించాలి..
- హాజరైన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారథి, బి.విరూపాక్షి

కర్నూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు (న్యూసిటీ): జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై సమగ్ర విచారణ చేసి అవినీతి అక్రమాలపై నిగ్గుతేల్చాలని, గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్లు వాస్తవాలు దాచిపెట్టి కాకిలెక్కలు చెబుతున్నారని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. శుక్రవారం జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో తాగునీరు.. సాగునీటి ప్రాజెక్టు పనులపై గరం.. గరంగా చర్చ సాగింది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, పి.రాజకుమారి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, గౌరు చరిత, గిత్తా జయసూర్య, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. వ్యవసాయం, గ్రామీణ తాగునీటి సరఫరా, ఇరిగేషన్, విద్యుత్ శాఖల పనితీరుపై ప్రధానంగా చర్చ జరిగింది. సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక అధికారులు నీళ్లు నమిలారు. కలెక్టరు రంజిత్‌బాషా జోక్యం చేసుకొని సమాధానం చెప్పాల్సి వచ్చింది.

జల్‌జీవన్ మిషన్ అక్రమాలపై విచారణ జరపాలి

జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) కింద ఇంటింటికి కుళాయి ఇవ్వడానికి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.313.56 కోట్లు మంజూరు చేసి 1,548 పనులు మంజూరు చేస్తే.. 881 పనులు చేపట్టి 525 పనులు పూర్తి చేశామని, 231 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 90 శాతం పరోగతి సాధించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు వివరించగా ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లు తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఈ పనుల్లో భారీ అక్రమాలు జరిగాయని అన్నారు. దీనిపై విచారణ చేసి అవినీతిపరుల నిగ్గుతేల్చాలని ఎంపీ బైరెడ్డి డిమాండ్ చేశారు. జేజేఎం పనులు మేజరు పంచాయతీ గోనెగండ్లలో ఏ స్థాయిలో ఉన్నాయో చేశారా..? అని ఎమ్మెల్యే బీవీ నిలదీశారు. వైసీపీ ప్రభుత్వంలో నిధుల స్వాహాపై విచారణ జరపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత డిమాండ్ చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జోక్యం చేసుకొని జేజేఎం పనుల్లో 90 శాతం ఇదే పరిస్థితి ఉందన్నారు. సమగ్ర విచారణ చేసి అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను మంత్రి బీసీ ఆదేశించారు.

జడ్పీ స్థాయి సంఘాలలో ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: జిల్లా పరిషత్ స్థాయి సంఘాలలో నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశభవనంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో జడ్పీటీసీలు స్థాయి సంఘాల సభ్యులను ఎన్నుకున్నారు. మొత్తం 7 స్థాయి సంఘాలు ఉంటాయి. 1వ స్థాయి సంఘం(ఆర్థికఅండ్ ప్రణాళిక)లో ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎన్ఎండీ. ఫరూక్, 2వ స్థాయి సంఘం(గ్రామీణాభివృద్ధి)లో డా. బైరెడ్డి శబరి, డా. పార్థసారథి, 3వ స్థాయి సంఘం(వ్యవసాయం)లో జయనాగేశ్వరరెడ్డి, 4వ స్థాయి సంఘం(విద్య, వైద్యం)లో బస్తిపాటి నాగరాజు, బొగ్గుల దస్తగిరి, 5వ స్థాయి సంఘం(మహిళా సంక్షేమం, పరిరక్షణ)లో కేఈ. శ్యాంబాబు, బి. వీరుపాక్షి, 6వ స్థాయి సంఘంలో జి. జయసూర్య, వై. బాలనాగిరెడ్డి, 7వ స్థాయి సంఘంలో భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, బీసీ. జనార్దన్‌రెడ్డి ఉంటారు.

పల్లెసీమల్లో కన్నీటి కష్టాలు తీరవా..?

చెంతనే తుంగభద్ర నది ఉన్నా కన్నీళ్లు తీరవా? అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు నిలదీశారు. కోడుమూరు పట్టణంలో వారానికి ఒకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. గాజులదిన్నె నుంచి పైపులైన్ వేయాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, రిజర్వాయర్ పక్కనే ఉన్నా.. వెలుగోడుకు తాగునీరు అందడం లేదని ఎంపీ బైరెడ్డి శబరి ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు 3.5 టీఎంసీలు కేటాయిస్తే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆలూరు నియోజకవర్గంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు పైపులైన్ల వల్ల గ్రామాల్లో తాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. ఆదోని మండలం బస్సాపురం ఎస్ఎస్ ట్యాంక్ ఓ వైపు బండ్ కూలిపోయిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు.





ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్యేలు గౌరు చరిత, బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, కేఈ శ్యాంబాబు, దస్తగిరి, హాజరైన సభ్యులు

పట్టిసీమ ద్వారా సీమ సస్యశ్యామలం

నదులు అనుసంధానంలో గత టీడీపీ ప్రభుత్వంలో పట్టిసీమ లిఫ్ట్ చేపడితే ఇదే సభలో గత వైసీపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పట్టిసీమ వేస్ట్ అన్నారని, ఇంతకూ పట్టిసీమ ద్వారా సీమకు ప్రయోజనం ఉందా.. లేదా..? చెప్పాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమండ్ చేశారు. సమాధానం చెప్పేందుకు నీళ్లు నమిలిన ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి చివరకు సీమకు ప్రయోజనమే అని పేర్కొన్నారు. గుండ్రేవుల నిర్మాణంపై తెలంగాణకు ఏమైనా లేఖ రాశారా..? బీవీ ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులకు ఆదాయం కోసమే జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు చేపట్టారా? అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిలదీశారు. హంద్రీనీవా విస్తరణ, అలగనూరు రిజర్వాయర్ టెండర్ల రికార్డులు కావాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కోరారు.

తీర్మానాలు ఇవి

- కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని కృష్ణా బేసిన్‌కు ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నానికి గత వైసీపీ ప్రభుత్వం తరలించిందని, దాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని కోడుమూరు, ఎమ్మిగనూరు బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రతిపాదించగా.. జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.
- గుండ్రేవుల జలాశయం నిర్మాణం గురించి ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత డిమాండ్ చేశారు. జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తీర్మానం ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు.
- **మంచినీటి పథకాలకు రూ.85 కోట్లు ఇవ్వాలి:** గ్రామీణ సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్ స్కీంలు) నిర్వహణ జడ్పీకి భారంగా మారింది. ఏడాదికి రూ.80-85 ఖర్చు అవుతుంటే.. ప్రభుత్వం ఇచ్చేది రూ.23 కోట్లే.. రూ.85 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి కోరుతూ తీర్మానం చేశారు.
- **పర్యాటకానికి జడ్పీ పాత భవనం:** జిల్లా పరిషత్తు (జడ్పీ) పాత భవనాన్ని ఏపీ పర్యాటక శాఖ (టూరిజం)కు చదరపు అడుగు నిర్మాణ ప్రాంతం రూ.15, ఖాళీ స్థలం రూ7.50లకు లీజుకు ఇచ్చేలా తీర్మానం చేశారు.



వేదికపై జడ్పీ చైర్మన్, మంత్రులు, కలెక్టర్లు

రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌గా బాలునాయక్

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: కార్మిక శాఖ రాయలసీమ జోన్ రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌గా బాలునాయక్‌ను నియమిస్తూ కార్మిక శాఖ కమిషనర్ ఎంవి. శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన బాలునాయక్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. 1995 ఆత్మకూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా, 2000 నుంచి 2005 వరకు కడప ఏఎల్ఓ-2గా, 2005 నుంచి 2011 వరకు పుత్తూరు ఏఎల్ఓగా, 2011 నుంచి 2016 వరకు మదనపల్లి అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా, 2016 నుంచి 2019 వరకు రాజంపేట్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ కర్నూలు కార్మిక శాఖ ఉపకమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి చిత్తూరు ఏసీఎల్‌గా, 2020 నుంచి 2022 వరకు తిరుపతి డీసీఎల్‌గా ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. 2021లో ఉప కమిషనర్‌గా పదోన్నతి పొంది ఇప్పటి వరకు తిరుపతిలో పని చేస్తున్నారు. అదే విధంగా 2022 నుంచి రాయలసీమ జోన్ ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలునాయక్‌కు రెగ్యులర్‌గా పదోన్నతి కల్పించారు.

కోసిగిలో రెండు చిరుతలు



కోసిగి తిమ్మప్పకొండలో కనిపిస్తున్న చిరుత పులులు

కోసిగి, జూలై 19: కోసిగి సమీపంలో మరోసారి రెండు చిరుత పులులు తిరిగాయని గ్రామస్థులు ఆందోళన చెందుతురు. గ్రామ సమీపంలోని తిమ్మప్పకొండ చిరుత పులులకు అడ్డాగా మారింది. గత మూడేళ్లుగా ఈ కొండపై చిరుత పులులు స్థావరం ఏర్పాటు చేసు కున్నాయి. శుక్రవారం సాయంత్రం విద్యుత్ సబ్‌స్టేషన్, కేజీబీవీ పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న తిమ్మప్ప కొండ నుంచి రెండు చిరుత పులులు వర్షానికి బయట రావడం స్థానిక కాలనీ ప్రజలు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు చూసి భయాందోళనలకు గురయ్యారు. రాత్రి వేళల్లో భయంగా ఉందని విద్యార్థినులు, ఉపాధ్యాయులు అన్నారు. చిరుత పులులను చూసి కొండలో ఉన్న కోతులు ఒక్కసారిగా గ్రామం లోకి వచ్చి అరవడం మొదలు పెట్టాయి. సుమారు గంటపాటు చిరుత పులులు కొండ రాళ్ల మధ్య తచ్చాడాయి. ఫారెస్టు అధికారులు కొండపై ఉన్న చిరుత పులులను బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉర్దూ వర్సిటీ వీసీగా షావలీఖాన్

కర్నూలు(అర్బన్), జూలై 19: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతిగా ప్రొఫెసర్ పీఎస్ షావలీఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీలో బాటనీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు, ప్రిన్సిపల్ ఎం.జహనరా, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రం లభ్యం

తుగ్గలి, జూలై 19: వ్యవసాయ పనులు చేసుకుంటున్న కూలీకి వజ్రం దొరికింది. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరిలో వ్యవసాయ పనులు చేసు కుంటున్న కూలీకి వజ్రం లభ్యం కావడంతో స్థానిక వజ్రాల వ్యాపారి రూ.1.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తుగ్గలి, జూలై 19: సాగు చేసిన పంటలకు దిగుబడి లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి కడివెల్ల రాముడు (44) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో కడివెల్ల రాముడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చి వాంతులు చేసుకుం టుండటంతో గమనించిన భార్య కడివెల్ల రాణి పత్తికొండ వైద్యశాలకు తర లించింది. ఆ తర్వాత కర్నూలు వైద్యశలకు తీసికెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకో లేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ గొర్రెలు మేపుకుంటూ రాముడు జీవనం సాగిస్తుండేవాడు. పంటలు కలిసిరాకపోవడంతో దాదాపు రూ.6 లక్షల మేర అప్పులు అయ్యాయని భార్య తెలిపింది. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కలిసి చర్చించుకుందాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 19: పార్టీలో అంతర్గత విభేదాలు ఉంటే కలిసి చర్చించుకుందామని, పార్టీ ఆదేశాలను ఎవ్వరూ ధిక్కరించడానికి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీకార్యాలయంలో ఆలూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆలూరు సీనియర్ నాయకులు వీరభద్రగౌడ్ తమను కలుపుకు పోవడం లేదని ఆరోపించారు. స్పందించిన తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఇన్‌చార్జీలను నియమించలేదని, పార్టీకి చెందిన మండల నాయకులను కూడా తొలగించలేదని, అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, నాయకులు విజయభాస్కరగౌడ్, ఆశోక్, రజని, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

32,673 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జూలై 19: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో నమోదయింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 32,673 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 808.40 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీ లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 33.3895 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. జలాశయం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆదోని రూరల్, జూలై 19 : ఎమ్మిగనూరు 11వ వార్డుకు చెందిన బోయ పెద్దయ్య, సుధ దంపతుల కుమారుడు ఉదయ్(20) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దయ్య దంపతులు బెంగుళూరుకు వలస వెళ్లి అక్కడ గౌండ పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఉదయ్, కిశో ర్ సంతానం. పెద్ద కొడుకు ఉదయ్ తల్లిదండ్రుల వద్ద ఉంటూ టైల్స్ దుకాణంలో పనిచేస్తూ ఎమ్మిగనూరులోని ఓ కళాశాలలో ఒపెన్ డిగ్రీ చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఉదయ్‌కి బెంగుళూరులోని ఎయిర్‌పోర్టులో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు రావాలని కబురు వచ్చింది. దీంతో ఎమ్మిగనూ రుకెళ్ళి 18వ తేదీన పుట్టిన రోజు వేడుక చేసుకొని, కాలేజీలో సర్టిఫికెట్లు తీసుకొని వస్తానని ఈనెల 16న ఉదయ్ స్వగ్రామానికి వచ్చాడు. 18న గురువారం ఉదయం స్నేహితుడు మునితో కలిసి ద్విచక్ర వాహ నంపై ఎమ్మిగనూరు నుంచి ఆదోనిలో ఉన్న అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాడు. స్నేహితులు ఎమ్మిగనూరులో పుట్టినరోజు కేక్ కట్ చేయడా నికి సన్నాహాలు చేశారు. ఆదోనిలోని అమ్మమ్మ ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని తీసుకొని వేర్వేరుగా స్నేహితుడు ముని, ఉదయ్ ఎమ్మిగ నూరు బయల్దేరారు. ఆదోని మండలం నాగలాపురం సమీపంలో ఎదు రుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఉదయ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్నేహితుడు ముని ఆదోని ఆసుపత్రికి చేర్చాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా, ఎమ్మి గనూరు సమీపంలో ఉదయ్ కన్నుమూశాడు. పుట్టిన రోజు నాడే కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బెంగుళూరులో ఉన్న తల్లి దండ్రులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఆరుగురు పోలీసుల బదిలీ

కర్నూలు, జూలై 19: నగరంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు పోలీసులపై ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ బదిలీ వేటు వేశారు. ఇటీవల కాలంలో వీటిపై ఆరోపణలు రావడంతో విచారించిన ఎస్పీ నిజమని తేలడంతో వారిని శుక్రవారం ఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. వారికి కార్యాలయంలో గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చి మద్దికెర, హోళగుంద, చిప్పగిరి ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో తాలుకా పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ భాస్కర్‌రాజు, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మినారాయణ, రామకృష్ణ, కానిస్టేబుల్ ప్రసాద్, నాలుగు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గోవిందు, కానిస్టేబుల్ నాయక్‌లు ఉన్నారు.

జీడీపీని సందర్శించిన ఐఆర్ఎస్ అధికారులు

గోనెగండ్ల, జూలై 19: జిల్లా ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు గాజులదిన్నె ప్రాజెక్టును శుక్రవారం ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి చింతరంజన్‌దాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ప్రాజెక్టులో ఎంత నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు కింద ఎన్నివేల ఎకరాలు సాగు కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఎన్నివేల ఎకరాల్లో సాగు అవుతున్నది. ఏ సీజన్‌లో రైతులకు నీరు అందజేస్తున్నదీ ప్రాజెక్టు అధికారులు డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం ప్రాజెక్టులో ఆరు క్రష్ట్ గేట్‌లకు గాను మూడు గేట్‌ల పనులు పూర్తి అయ్యాయి. మిగతా మూడు గేట్ల పనులు త్వరలో పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సోనిబాయి, ఏవో హేమలత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోయిన వైసీపీ నాయకులు

- నమాజు చేస్తున్న యువకులపై దాడి
- ఇద్దరికీ తీవ్ర గాయాలు



చేతిలో గొడ్డలి పట్టుకున్న వైసీపీ నాయకుడు

కోసిగి, జూలై 19: మండలంలోని సాతనూరు గ్రామంలో శుక్ర వారం మధ్యాహ్నం మసీదులో నమాజు చేస్తున్న ముస్లిం యువ కులు నజీర్, నవాజ్‌లపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయ కులు ముల్ల కాశీం, అతని కుమారులు ఖాజా, రెహిమత్ వలి, జిలా న్, అబ్దుల్ కర్రలతో దాడులు చేసి గొడ్డలితో చంపుతామని బెది రించారు. నమాజు చేస్తున్న తమపై దాడి చేశారని నజీర్, నవాజ్ తెలిపారు. తీవ్ర రక్తగాయాలైన యువకులను మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. గ్రామం లోని దర్గాని ఇనామీ వక్ఫ్‌బోర్డు భూములను తాము నెల రోజుల కిందట నజీర్, నవాజ్ జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారుల సమక్షంలో వేలం పాటలో దక్కించుకోవడం జీర్ణించుకోలేని వైసీపీ ముస్లిం నాయకులు దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విష యంపై ఎస్ఐ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎడతెరపిలేని వర్షం

● పలు కాలనీలు జలమయం ● ఉప్పొంగిన వాగులు, వంకలు ● రాకపోకలకు అంతరాయం



ఆత్మకూరు: తిక్కయ్యస్వామి దర్గా వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



అబ్బీపురం చెంచుకాలనీలోకి చేరిన వర్షపు నీరు



పాములపాడు గ్రామ శివారులో పొంగిపొర్లుతున్న ఎద్దులవంక వాగు

ఆత్మకూరు, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా ఆత్మకూరు ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉదయం నుంచి రాత్రి వరకు అడపదడప మోస్తరు వర్షం కురిసింది. అంతేకాకుండా గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం తెల్లవారుఝాము వరకు పదునైన వర్షం కురిసింది. కాగా అల్పపీడన వర్షాల కారణంగా ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్, సాయిబాబానగర్, ఏకలవ్యానగర్, ఇందిరానగర్, అక్కిరాజుకాలనీ, రహమత్‌నగర్, హుసేన్‌సానగర్, వెంగళరెడ్డి నగర్, అర్బన్‌కాలనీ తదితర లోతట్టుకాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. ఇందిరానగర్ శివారు కాలనీలో, ఆర్డీటీ కాలనీలో సీసీ రోడ్లు లేక జనం అవస్థలు పడ్డారు. అంతేకాకుండా పట్టణంలోని ప్రధాన వాణిజ్య సముదాయమైన కప్పలకుంట, తిక్కయ్యస్వామిదర్గా, అప్పారావువీధి తదితర ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో జనం ఇక్కట్లకు లోనయ్యారు. కాగా ఖరీఫ్ సీజన్ తొలిరోజుల్లో సాగుచేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఇదిలావుంటే భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు, చెరువుల్లో పుష్కలంగా నీరు చేరితే వరిసాగు ఊపందుకునే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

మహానంది: మహానంది మండలంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో గ్రామాల్లోని ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. వర్షంతో మహానంది క్షేత్రానికి దైవ దర్శనం కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని అబ్బీపురం చెంచుకాలనీ లోని పూరి గెడిసెల్లోకి వరద నీరు రావడంతో చెంచులు ఇబ్బందులు పడ్డున్నారు. గుడిసెల్లోకి వరదనీరు రావడంతో కాలనీ ప్రజలు వీధిన పడ్డారు. అలాగే మహానంది సమీపంలో పాలేరు వాగులోకి నల్లమల అటవీ ప్రాంతంలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తే వాగుపై నీరు ప్రవహించే అవకాశం ఉంది. మరో రెండు ఇలాగే వర్షం కురిస్తే పాలేరు వాగుపై నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచి పోయే అవకాశం ఉంది. కాగా అరటి, పసుపు పంటలకు వర్షం అనుకూలమైందని రైతులు తెలిపారు.

పాములపాడు: మండలంలో రెండు రోజులుగా తుఫాన్ కారణంగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి, ఎగువన నలమల్ల అటవీ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో చెలిమిళ్ళ గ్రామ శివార్లలోని ఎద్దులొంక, శుద్ధవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇస్కాల గ్రామ శివారులోని భవనాశివాగు ఉప్పొంగడంతో ఒడ్డున ఉన్న నందీశ్వర ఆలయం నీట మునిగిపోగా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల పరివాహక పంటపొలాలు నీట మునిగాయి. శుక్రవారం 62.2 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. గ్రామాలలోని రహదారులు బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. మేఘాలు కమ్ముకుని వీస్తున్న ఈదురు గాలులకు జనం ఇళ్ళకే పరిమితమయ్యారు. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచి ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అంకాలమ్మకు బోనం



అంకాలమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూలై 19: శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం గ్రామ దేవత అంకాలమ్మ అమ్మవారికి దేవస్థానం బోనం సమర్పించింది. ఈ కార్యక్రమంలో ఉదయం ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకుడు ఎం.ఉమానాగేశ్వర శాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పలువురు అర్చకులు, వేదపండితులు అమ్మవారికి సమర్పించేందుకు నూతన పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలు, గాజులు, ఫలపుష్పాలు ఉరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామ దేవతకు విశేష పూజాధికాలు నిర్వహించి బోనం సమర్పించారు. పూజా కార్యక్రమంలో దేశం సుభిక్షంగా ఉండాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలగాలని సంకల్పం పఠించారు.

వైభవంగా ఊయలసేవ

శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు.

సుంకులా పరమేశ్వరీదేవికి..



మహానందిలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మహానంది, జూలై 19: మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో వెలసిన సుంకులా పరమేశ్వరీదేవి అమ్మవారికి ఆషాడ మాసం పురష్కరించుకొని స్థానిక దేవస్థానం కాలనీ, ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు శుక్రవారం బోనాలు సమర్పించారు. అలాగే చీర, సారెను అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అర్చకులు పుల్లారి జనార్దన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ప్రసాదం నివేదనగా సమర్పించారు. పసుపు, కుంకుమ అందచేశారు.

వాసంతి సోదరికి గురుకుల పాఠశాలలో ప్రవేశం



వాసంతి సోదరి జ్యోతిని గురుకుల పాఠశాలలో చేరుస్తున్న అధికారులు

పగిడ్యాల, జూలై 19: మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో హత్యకు గురైన బాలిక వాసంతి అక్క జ్యోతిని లక్ష్మాపురం అంచె సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం చేర్పించినట్లు ప్రిన్సిపాల్ రవణమ్మ తెలిపారు. వాసంతి కుటుంబ నిరుపేద కుటుంబ కావడంతో సోదరి జ్యోతిని ప్రభుత్వం గురుకుల పాఠశాలలో చదివించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు ఆదేశాలు జారీ చే శారు. దీంతో కలెక్టరు రాజకుమారి ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలల సమన్వయకర్త శ్రీదేవికి సమాచారం ఇచ్చారు. ఆమె ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా బాలిక సంరక్షణ అధికారి శారద, శ్వేత వాసంతి తల్లిదండ్రులతో మాట్లాడి జ్యోతిని లక్ష్మాపురం గురుకుల పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.

23న ఇంటర్వ్యూలు

నంద్యాల (నూనెపల్లె), జూలై 19: జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో మిషన్ శక్తి-సంబల్ ఖాళీలకు ఈ నెల 23వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ శాఖలో ఖాళీగా ఉన్న వివిధ విభాగాలలో ఉన్న భర్తీలకు మార్చి నెల 12వ తేదీన నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు పోస్ట్‌పోన్ కావడం తెలిసిన విషయమే. ఆ పోస్టుల భర్తీకి జేసీ చాంబర్‌లో 23వ తేది మధ్యాహ్నం 2 గంటలలోపు షార్ట్ లిస్ట్ అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

చాపిరేవుల సర్పంచ్‌గా రాజు

నంద్యాల రూరల్, జూలై 19: నంద్యాల మండల చాపిరేవుల ఉపసర్పంచ్ రాజును సర్పంచ్‌గా అధికారిక గుర్తింపు పొందారు. ఇంతవరకు సర్పంచ్‌గా కొనసాగిన దేవి అనారోగ్య కారణాలరీత్యా విధులను సక్రమంగా నిర్వర్తించలేనని ప్రభుత్వ అధికారులకు గతంలో వినతులు అందజేశారు. శుక్రవారం నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఎదుట అధికార మార్పిడితో పాటు సర్పంచ్‌గా దొమ్మరి నంద్యాల రాజు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచ్‌గా ఉన్న దేవి ఆరోగ్యం సరిగా లేదని విధులు నిర్వర్తించలేనని లిఖిత పూర్వకంగా సమ్మతి తెలపడంతో ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న రాజుకు సర్పంచ్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా కృషి చేయాలని కోరారు.



ఘనంగా మాండ్ర జన్మదిన వేడుకలు



నందికొట్కూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, జూలై 19: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి ఆధ్వర్యంలో పట్టణంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డా.వనజ, ప్రభు కుమార్ జివ్వాజి సుంకన్న గౌడ్ సేవాసమితి నాయకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. గ్రామంలోని బస్టాండ్ ఆవరణంలో టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, హేమసుందరరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాగుల రామస్వామి, విజేయుడు, ఫరూక్ బాషా, చంద్రేష్, బాలీశ్వర్‌గౌడ్, అశోక్, నరసింహరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'



ఆసుపత్రిలో రికార్డును పరిశీలిస్తున్న డీపీఎంవో డాక్టర్ సునీత

బండిఆత్మకూరు, జూలై 19: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీపీఎంవో సునీత సూచించారు. మండలంలోని శిగవరం, నారాయణపురం గ్రామాల్లోని గ్రామీణ వైద్య కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వీధుల్లోకి వెళ్లి మురుగు కాలువలను పరిశీలించారు. డీపీఎంవో ప్రజలతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం తీసుకోవాలని, శుద్ధజలం గానీ, కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. కుష్టు వ్యాధిగ్రస్థులకు పలు సూచనలు చేశారు. వెంట డీపీహెచ్ఎంవో డాక్టర్ నాజనీన్, ఎంపీహెచ్ఈవో సుబ్రమణ్యం, సిబ్బంది మల్లమ్మ, కిరణ్ పాల్గొన్నారు.

వెలుగోడు: ప్రజలు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వేల్పనూరు అసుపత్రి వైద్యాధికారులు జహీర్ వలి, ప్రణీత్ సూచించారు. శుక్రవారం వేల్పనూరు పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయం వన్ పరిధిలో ఫ్రైడే, డ్రైడే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుంకన్న, ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశాలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

'నంద్యాల రైల్వే స్టేషన్ సమగ్రాభివృద్ధే లక్ష్యం'



నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం సైమన్

నంద్యాల (నూనెపల్లె), జూలై 19: నంద్యాలలోని రైల్వే స్టేషన్ సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం సైమన్ అన్నారు. దేశంలోనే ఎంపికైన మోడల్ స్టేషన్‌లలో నంద్యాల రైల్వే స్టేషన్ ఒకటిగా ఉండటంతో స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఏడీఆర్ఎం సైమన్ డివిజనల్ రైల్వే అధికారులు శుక్రవారం నంద్యాల రైల్వే స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

● గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం సైమన్ నంద్యాలకు రావడంతో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ శుక్రవారం రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎంను కలిశారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై చర్చించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి మేరకు నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా 30 అడుగుల రోడ్డును 40 అడుగులు చేయాలని ఫిరోజ్ ఏడీఆర్ఎంను కోరారు. రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ రైల్వే ట్రాక్ తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కౌన్సిలర్లు శివశంకర్‌యాదవ్, కృపాకర్, అజ్మీర్ విశ్వనాథరెడ్డి తదితరులు ఉన్నారు.

● గూడ్స్ షెడ్ కార్మికులకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మహ్మద్‌గౌస్, లక్ష్మణ్ ఏడీఆర్ఎం సైమన్ కు వినతి పత్రం అందజేశారు.

రేపు శాకంబరిగా అమ్మవారు

మహానంది, జూలై 19: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం ఆషాడ పౌర్ణమి పురష్కరించుకొని శాకంబరి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారికి వివిధ రకాల వెయ్యి కేజీలకు పైగా కూరగాయలను నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్షమ్మ దంపతులు అందస్తారని చెప్పారు. అమ్మవారి మూల విరాట్ విగ్రహంతో పాటు ఆలయం ప్రాంగణాన్ని ఆకు కూరలతో పాటు వివిధ రకాల కూరగాయలతో అలంకరించి శాకంబరి ఉత్సవం ఆలయ వేదపండితులు, అర్చకులు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం కామేశ్వరీదేవికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలను జరుపుతారని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'బాలికా విద్యను ప్రోత్సహిద్దాం'

పాములపాడు, జూలై 19: బాలికలను చదివిద్దాం వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం అని అంగన్‌వాడీ సూపర్ వైజర్ లలిత ప్రభావతి అన్నారు. గురువారం మండలంలోని రుద్రవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బాలసభ నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్య వివాహాలపై గూర్చి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సరోజ, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జీపీఎస్ ఉత్తర్వులు రద్దు హర్షణీయం'

ఆత్మకూరు, జూలై 19: గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారెంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్)ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ చాంద్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ కంటే జీపీఎస్ తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు జీపీఎస్ ఉత్తర్వులను రద్దు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

'విద్యాభివృద్ధికి పాటుపడాలి'

వెలుగోడు, జూలై 19: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత ధనాన్ని విద్యాభివృద్ధి కోసం నిరుపేద విద్యార్థుల అభివృద్ధికి అందించాలని కడప హోమియోపతి కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ శేషఫణి అన్నారు. శుక్రవారం ఆయన వెలుగోడు పట్టణంలోని సరస్వతి శిశు మందిరం పాఠశాల విద్యార్థుల సహాయ నిధి కోసం పది వేల రూపాయలను ఆయన పాఠశాలకు విరాళం అందజేశారు. పాఠశాల సమితి కార్యదర్శి, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దనరెడ్డి, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఆచార్య బృందం పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూలై 19: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన కె.రామకోటిరెడ్డి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకుడు రవికి అదజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ముగిసిన చెస్ పోటీలు



చెస్ విజేతలతో ప్రముఖులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 19: ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ 19 ఓపెన్, బాల బాలికల చెస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. రామకృష్ణ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, భారతీయ క్రీడా సెక్రటరీ సుధాకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి సిరిగిరి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలుర విభాగంలో మొదటి నాలుగు స్థానాలలో కుషల్ (అనంతపురం), ధృవీష్ దొండపాటి(గుంటూరు), రామ్‌చరణ్ తేజ (ఈస్ట్ గోదావరి), హర్షవర్ధన్ ఆచారి (నంద్యాల) నిలించారు. బాలికల విభాగంలో మొదటి నాలుగు స్థానాలలో ఎన్టీఆర్ జిల్లా నుంచి సర్వాణి, నెల్లూరు జిల్లా నుంచి హిమ తేజశ్విని , అనంతపురం జిల్లా నుంచి శ్రీహ, ఈస్ట్ గోదావరి నుంచి కావ్యశ్రీ నిలిచారని టోర్నమెంట్ నిర్వాహకులు, రాష్ట్ర చెస్ సంఘం సయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి తెలిపారు.

'బాలిక కేసును సీబీఐకి అప్పగించాలి'

పగిడ్యాల, జూలై 19: ముచ్చుమర్రి గ్రామంలో హత్యకు గురైన వాసంతి కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి ముచ్చుమర్రికి వచ్చిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డికి విన్నవించారు. బాలిక హత్యకు గురై 13 రోజులు కావస్తున్నా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడం తప్ప కేసును ఎలాంటి పురోగతి లేదన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పక్కీర్‌సాహెబ్, రాజు, మద్దమ్మ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'పెట్టుబడి సాయం అందించాలి'

మహానంది, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు రైతులకు ప్రకటించిన హామీల్లో భాగంగా తక్షణమే పంటల సాగుకు పెట్టుబడి కింద రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు కోరారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి-2 సచివాలయంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అధికారికి వినతి పత్రం అందచేశారు. గాజులపల్లి గ్రామ రైతు సంఘం నాయకులు హిమామ్ హుసేన్, రాజానాయక్, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

'వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి'

ఆత్మకూరు రూరల్, జూలై 19: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆర్‌జేడి కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు మే, జూన్ రెండు నెలల వేతనాలు అందక పోవడంతో పలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తిరిగి జులై మాసం కూడా పూర్తి కానునండటంతో మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

'విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త'

నంద్యాల రూరల్, జూలై 19: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ రామయ్య సూచించారు. అంతర్గత వైరింగ్‌కు ఐఎస్ఐ గుర్తింపు కలిగిన వాటిని ఉపయోగించాలని, ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోవద్దని, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తోటలలో, ఇంటి పరిసరాలలో చెట్ల కొమ్మలను తొలగించేటప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బందికి గానీ, 1902 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ సర్వీస్ కోసం వినియోగించే వైరు నాణ్యమైన మరియు లోడుకు అనుగుణంగా వాడినట్లయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలను, వోల్టేజీ హెచ్చుతగ్గులను నివారించవచ్చన్నారు.

'అతిసార సోకకుండా చర్యలు తీసుకోవాలి'



కడుమూరులో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

మిడుతూరు, జూలై 19: మండలంలోని గ్రామాల్లో అతిసార సోకకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. దేవనూరు మజరా గ్రామమైన సున్నంపల్లిలో శుక్రవారం 104 వాహనాన్ని నోడల్ అధికారి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన సిబ్బందికి గ్రామాల్లో ప్రజలకు అతిసార సోకకుండా అవగాహన కల్పించి బీసీజీ ఇంజక్షన్లు వేయించాలని సూచించారు. అనంతరం కడుమూరు పాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య అధికారి రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు ఏసేపు, ఏఎన్ఎం లక్ష్మి, సరస్వతి, పీహెచ్‌సీ సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

'పారిశుధ్య నిర్వహణ తప్పనిసరి'

బండిఆత్మకూరు, జూలై 19: గ్రామాల్లోని మురుగు ఆవాసాల్లో స్థానిక సిబ్బంది పారిశుధ్య పనులు తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీవో విజయరావు, ఏవో హనీఫ్‌ఖాన్, డాక్టర్ భావన, సవిత, ఏపీవో వసుధ సూచించారు. శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా బండిఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, ఆసుపత్రి, ప్రధాన వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను, అలాగే ఎ.కోడూరు, ఎర్రగుంట్ల సచివాలయాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది వేళకు విధులకు హాజరు కావాలని, పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఎస్‌లు నటరాజ్, సుబ్బారావు, టీఏ ప్రియస్వప్న, ఎప్ఏ నాగరాజు పాల్గొన్నారు.

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు రూరల్, జూలై 19: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న కోరారు. శుక్రవారం ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామంలో సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం



మహానంది, ఎంసీ ఫారం మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

మహానంది, జూలై 19: మహానంది నుంచి ఎంసీ ఫారం మీదుగా గాజులపల్లికి వెళ్లే మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారి అడుగుకో గుంతతో అధ్వనంగా తయారయ్యింది. నంద్యాల, గుంటూరు రహదారిని కలిపై ఈ మార్గం పదేళ్ల నండుచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక పోవడంతో ఈ రహదారిలో సుధూర ప్రాంతాల నుంచి మహానందీశ్వరుడి దర్శనం కోసం వివిధ వాహనాల్లో వచ్చే భక్తులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలోమీటర్ల ప్రయాణానికి కనీసం అరగంట సమయం పడుతోంది. సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అమృతవల్లి అమ్మవారికి జ్యేష్ఠాభిషేకం



అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి జ్యేష్ఠాభిషేకం చేస్తున్న వేదపండితులు

నంద్యాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో వెలసిన అమృతవల్లి అమ్మవారికి శుక్రవారం వేదపండితులు జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. వేకువజామున్నే అమ్మవారిని పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు చేపట్టి మాఢ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

పార్వతీదేవికి సారె



కోదండ రామాలయంలో పార్వతీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 19: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయంలో పార్వతీదేవి, అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, ఆకులతో అలంకరించారు. శాకంబరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి చీర, సారె, గోరింటాకును సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానీదేవి, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం



రఫి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, జూలై 19: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త సాహెబ్ బాషా తండ్రి గోనవరం రఫి (70) మృతికి రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. రఫి మృతదేహానికి బీసీ ఇందిరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. ఆమె వెంట స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

బాలల ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలి



జలదుర్గం ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

ప్యాపిలి, జూలై 19: బాలల ఆరోగ్య సంరక్షణపై తగు జాగ్రతలు తీసుకోవాలని రాష్ట్రీయ బాలల సంరక్షణ ప్రోగ్రాం జిల్లా అధికారి కాంతారావు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ బాలల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో తిరిగి బాలల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగనవాడీ వర్కర్లు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

చాగలమర్రి, జూలై 19: చాగలమర్రి గ్రామంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోఏలకు లోకోస్ యాప్‌పై ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో జిల్లా ట్రైనర్ నరేష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లోకోస్ యాప్ సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఒకే యాప్ కింద ఉండాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ యాప్‌ను అమలు చేసిందని అన్నారు. యాప్‌లో ప్రతి పొదుపు సభ్యురాలు నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రూప్‌లోని సభ్యుల లావాదేవీల వివరాలు తెలుసుకోవడానికి యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు పాల్గొన్నారు.

'కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదు'

చాగలమర్రి, జూలై 19: కుష్టువ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని ముత్యాలపాడు వైద్యాధికారి సుల్తాన తెలిపారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం పరిశీలించారు. కుష్టువ్యాధి లక్షణాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో కవిత, ఏఎన్ఎం భూదేవి, హెచ్‌ఏ మనోహర్, ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి, రజిని పాల్గొన్నారు. అలాగే చాగలమర్రి 7వ వార్డులో నోడల్ పర్సన్ రామలింగారెడ్డి ఇంటింటిని సర్వేను పరిశీలించారు. 25 అనుమానిత కేసులను గుర్తించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తిని వైద్యులు ఇమ్రాన్ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఈ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

ప్యాపిలి, జూలై 19: హిందువులు సనాతన ధర్మాన్ని తప్పక ఆచరించాలని తిరుమల, తిరుపతి దేవస్థానం హిందూధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని రాంపురం రామాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన హిందూ ధార్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో ధార్మిక ప్రవచన కర్త దేవీదయానందసింగ్, సుంకర నాగేశ్వరరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

బేతంచెర్ల, జూలై 19 : పేద ప్రజలకు శేషారెడ్డి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా గోపాల్, హుశేన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులకు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వీరారెడ్డి, కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు విజయ నాగరాజు, సత్తార్, మాణిక్యం శెట్టి, రామ్మూర్తి పాల్గొన్నారు.

జడి వాన

బేతంచెర్ల, జూలై 19: పట్టణంలో కురుస్తున్న జడి వానతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం పడటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు పనుల కోసం బయటకు వెళ్లాలంటే చలి, వానతో వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

రుద్రవరం: రుద్రవరం మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురుస్తూనే ఉంది. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. మొక్క జొన్న, కంది పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. వాగులు, వంకల్లో వర్షపు నీరు ప్రవహిస్తోంది. చెరువులకు వర్షపు నీరు చేరింది.

దొర్నిపాడు: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో కాలువలు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక వాడుముఖం పట్టిన మినుము, పెసర, మొక్కజొన్న పంటలకు తదితర పంటలు జీవం పోసుకున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో రైతులు పత్తి, మిరప తదితర పంటలు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అలాగే పలు కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బనగానపల్లె: మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి వర్షం చిరుజల్లులతో ప్రారంభమై ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి పట్టణంలోని ఉన్నత పాఠశాల, తహసీల్దారు కార్యాలయం, జడ్పీ క్రీడా మైదానంలో వర్షపు నీరు నిలిచి పోయింది.

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో శుక్రవారం ఎడతెరిపి లేని మోస్తరు వర్షం కురిసింది. 26 మీ.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో రహదారులు నీటి కుంటలుగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నెల రోజుల నుంచి వర్షం కోసం రైతులు ఎదురు చూశారు. మొక్కజొన్న పంట వాడుముఖం పట్టడంతో కురిసిన వర్షం జీవం పోసింది. వర్షం కురవడంతో వరి సాగుకు రైతులు నిమగ్నమయ్యారు.

అవుకు: మండలంలో గురువారం రాత్రి 36.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. ఖరీఫ్‌లో మెట్ట పొలాల్లో పంటలు సాగు చేసుకొనేందుకు ఈ వర్షం ఉపయోగంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రుద్రవరంలో పెద్దరాజు చెరువుకు చేరిన వర్షపు నీరు



బేతంచెర్లలో కురుస్తున్న వర్షం

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి బీసీతో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు

బనగానపల్లె, జూలై 19: ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బనగానపల్లె మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు శుక్రవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి వినపత్రం సమర్పించారు. ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలాలు కేటాయించాలని, వివిధ యాప్‌ల నుంచి మినహాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, జిలాని బాషా, కోడూరు రవితేజారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

డోన్(రూరల్), జూలై 19: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఉడుములపాడు గ్రామ సచివాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఈ మేరకు ఆందోళనలు చేపట్టారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పెట్టుబడుల సాయం కింద రూ.20వేలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు చిన్న రెహిమాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులపై ఎస్ఐ

ఇన్‌చార్జిని కూడా నియమించని అధికారులు



రుద్రవరం పోలీసు స్టేషన్

రుద్రవరం, జూలై 19: ఈ ఏడాది జూన్ 29 నుంచి ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సెలవుపై వెళ్లారు. మండలంలో 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో 49003 జనాభా ఉంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐల పర్యవేక్షణలో కొనసాగుతోంది. సమస్యలు అధికంగా ఉన్న మండలంలో ఎస్ఐ లేకపోవడం మరింత సమస్యగా మారిందని పలువురు అంటున్నారు. ఇంత వరకు ఇన్‌చార్జి ఎస్ఐని కూడా నియమించలేదు. ఈ విషయంపై సీఐ చంద్రబాబు మాట్లాడుతూ ఎస్పీ, డీఎస్పీల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని తెలిపారు.

'ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి'

నంద్యాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆషాడ మాసంలో కన్యాకా పరమేశ్వరి అమ్మవారికి ప్రతిశుక్రవారం ఆర్యవైశ్యులు నిర్వహించే పూజల్లో భాగంగా గోరింటాకు కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిలప్రియ పాల్గొన్నారు. ఆమె రాకను పురస్కరించుకొని ఆళ్లగడ్డ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హరీష్‌బాబు తన కార్యవర్గ సభ్యులతో కలిసి మేళతాళాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అఖిలప్రియచే అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు ఎమ్మెల్యే అఖిలప్రియను శాలువ, పూలమాలలతో, పసుపు, కుంకుమలతో ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్యులు, వైద్యుడు రామసుబ్రమణ్యం పాల్గొన్నారు.

'హామీల అమలుకు కృషి': ఆళ్లగడ్డ శిల్ప కళాకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం శిల్పకళాకారులు ఆమెను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ మంత్రులతో మాట్లాడి శిల్ప కళాకారులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని, నంద్యాల వైపు రహదారికి ఇరువైపుల శిల్ప కళామందిరాలు ఉండటంతో ఆర్చిలు వేయిస్తామని చెప్పారు. శిల్పాలు తయారు చేయడానికి అవసరమయ్యే రాళ్ల రవాణాపై రాయితీ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అసెంబ్లీలో కళాకారుల గురించి మాట్లాడి గుర్తింపు కార్డులు ఇప్పించి ఒక కమిటీ లాగా ఏర్పాటు చేసి శిల్పకళాకారుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



ఎమ్మెల్యే అఖిలప్రియను సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

పీర్ల చావిళ్ల వద్ద వేడుకలు

అవుకు, జూలై 19 : మండలంలోని పీర్ల చావిళ్ల వద్ద మొహర్రం ముగిసిన మూడో రోజు సాంప్రదాయబద్ధంగా జరిపే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. చావిళ్లలోని పీర్ల పెట్టెల వద్ద చదివింపులు జరిపించి పూజలు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

డోన్(రూరల్): పట్టణంలోని పాతపేటలో కొలువుదీరిన దస్తగిరి స్వామి పీర్ల చావిడిలో శుక్రవారం రాత్రి జార్తాల్ ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు ఆర్ఈ రాజావర్దన్, పోస్టు ప్రసాద్, దస్తగిరి స్వామి కమిటీ సభ్యుడు ఫరీద్ ఆధ్వర్యంలో జార్తాల్ కార్యక్రమం వైభవంగా జరిగింది.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి జియారత్

రుద్రవరం: రుద్రవరంలో మౌలాలి స్వామి జియారత్ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాలాలతో భక్తులు తరలివచ్చి మౌలాలి స్వామికి వెండి గొడుగులు, పూల సేరాలు స్వామికి సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.



అవుకులో పీర్ల చావిడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన మౌలాలి స్వామి జియారత్ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మొహర్రం వేడుకలయ్యాక మూడో రోజు మౌలాలి స్వామి పీర్లకు జియారత్‌లు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి



పాడిరైతులకు ఎములపొడి అందజేస్తున్న ఏడీ మోహన్‌రావు

సంజామల, జూలై 19: పాడిపశువులను పోషించుకునే రైతులు మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గిద్దలూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు సోకే సాధారణ జబ్బులు, గర్భకోశ వ్యాధులు తదితర వ్యాధులకు సంబంధించి పశువైద్యులు చికిత్స చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ రైతులకు పాడిపశువుల పోషణ వాటికి సోకే జబ్బులు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. రైతులకు ఉచితంగా ఎముల పొడిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, శివానంద, పద్మావతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డులతో కష్టాలకు తెర: ఏవో

కొలిమిగుండ్ల, జూలై 19: కౌలు గుర్తింపు కార్డులతో కౌలు రైతుల కష్టాలకు తెర పడుతుందని కొలిమిగుండ్ల మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుడి, హనుమంతుగుండం గ్రామాల్లో ఏఓ జ్యోతి ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు.

చాగలమర్రి: కౌలు రైతులు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం చాగలమర్రి మూడవ రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు ఏవో రంగనేతాజీ అధ్యక్షతన నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల ప్రయోజనాల గురించి డీటీ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, కౌలు రైతులు పాల్గొన్నారు.

'మెరుగైన విద్యనందించాలి'



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురామ్

ఉయ్యాలవాడ, జూలై 19: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంపీడీవో రఘురామ్ సూచించారు. శుక్రవారం పుచ్చకాయలపల్లె గ్రామ కేజీబీవీ, మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలను ఎంఈవో ప్రతాప్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కేజీబీవీలో మౌలిక వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నామన్నారు. అలాగే మాయలూరు ఉన్నత పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వో అంజనమ్మ, హెచ్‌యం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

అవుకు, జూలై 19: మండలంలోని రైతులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఉపాధి హామీ పథకం డోన్ క్లస్టర్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం అవుకు ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఎంపీడీవో మల్‌రెడ్డి, ఏపీవో హనీఫాతో కలసి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశాలన్ని నిర్వహించి ఉపాధి పనులపై సమీక్షించారు. శింగనపల్లె సమీపంలో సాగవుతున్న పండ్లతోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ రాగిణి, క్లస్టర్ టీఏ సాధిక్‌వలి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతో మార్పు మొదలైంది ..

కొలిమిగుండ్ల, జూలై 19: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో గ్రామాల్లో మార్పు మొదలైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పేర్కొన్నారు. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మురికి కాలువలు కూడా శుభ్రం చేయలేదన్నారు. దీంతో వీధులన్నీ చెత్త కుప్పలతో కంపుగా మారాయన్నారు. శుక్రవారం నంద్యాల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు.

'పని వేళలు పాటించాలి'

రుద్రవరం, జూలై 19: మండలంలోని సచివాలయ ఉద్యోగులు పని వేళలు పాటించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. మండలంలోని మందలూరు సచివాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శిలు ఓబులేసు, మౌనిక పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న బనగానపల్లె సీఐ

బనగానపలె, జూలై 19: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు చర్యలు తప్పవని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శుక్రవారం బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ఘర్షణలకు పాల్పడ్డా, బెదిరించినా చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు.

న్యాయవాదుల ఆందోళన



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

డోన్(రూరల్), జూలై 19: బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డోన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం డోన్ కోర్టు బయట ప్రధాన రోడ్డులో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఈ వేణుగోపాల్ గౌడు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం న్యాయవాదుల మనోభావాలను భంగం కలిగించేలా ఉందన్నారు. బార్ కౌన్సిల్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు బద్దెల వెంకటేశ్, కృష్ణ ప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీసేవ

బనగానపల్లె, జూలై 19: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

'విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూలై 19: వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు, రైతులు విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ షాజహాన్ సూచించారు. శుక్రవారం విద్యుత్ కేంద్రంలో మాట్లాడుతూ విద్యుత్ తీగలు, స్తంభాల వద్దకు వెళ్లకూడదన్నారు. లోవోల్టేజి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కొలిమిగుండ్ల: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న అంజనేయులు సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ ఇళ్ల ముందు, మేడపైన దుస్తులు ఆరబెట్టడానికి వెళ్లినప్పుడు, రైతుల బోరు బావుల వద్ద మోటార్లు వినియోగించేట ప్పుడు, ఇళ్లలో ఎలక్ట్రికల్ వస్తువులు వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'జనసేన విజయం సంతోషదాయకం'

నంద్యాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి కృషి చేశామని, ఇది సంతోషకరమని జబర్దస్ హాస్య నటుడు, ఆళ్లగడ్డ వాసి సద్దాం అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఓ డాబాకు వచ్చిన ఆయనను జనసేన పార్టీ కార్యకర్తలు కలిసి సన్మానించారు. సద్దాం మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో వేడుకలు

బేతంచెర్ల, జూలై 19 : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో ఉన్న మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం రాత్రి వైభవంగా తిరుచిని వేడుకలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీతారామాంజనేయులు సమక్షంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుచిని వేడుకలను పండితులు, అర్చకుల చేత నిర్వహించారు

రూ.లక్ష ఆర్థిక సాయం

నంద్యాల, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సోషల్ మీడియా సభ్యుడిగా కొనసాగుతున్న శిరివెళ్ల మండలం చెన్నూరు నివాసి విజయ్‌కు సీఎం చంద్రబాబు రూ.లక్ష విలువ చేసే చెక్కును పంపించారు. ఎమ్మెల్యే అఖిలప్రియ చేతుల మీదుగా శుక్రవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే స్వగృహంలో అందుకున్నారు. గత ప్రభుత్వం తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని విజయ్ సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం స్పందించి విజయ్ కుటుంబ ఆర్థిక అవసరాల కోసం రూ. లక్ష విలువ చేసే చెక్కును ఎమ్మెల్యేకు పంపించారు. చంద్రబాబు, ఎమ్మెల్యే అఖిలప్రియకు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, జూలై 19: చాగలమర్రి గ్రామంలోని సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. చిన్నారుల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్మిత, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల తరలింపును

అడ్డుకున్న టీడీపీ నాయకులు



ట్రాక్టర్‌లో విద్యుత్‌శాఖ పరికరాలు

రుద్రవరం, జూలై 19: రుద్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి శుక్రవారం ట్రాక్టర్లలో పరికరాలు తరలిస్తుండగా అడ్డుకున్నామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెప్పారు. మండలంలోని నల్లవాగుపల్లె మెట్ట వద్ద ఒక ట్రాక్టరు, నాగులవరం గ్రామ సమీపంలో మరో ట్రాక్టర్‌ను అడ్డగించామని చెప్పారు. ఒక ట్రాక్టర్‌ను పోలీసులకు, మరో ట్రాక్టర్‌ను విద్యత్ సబ్‌స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. టీడీపీ నాయకులు రంగానాయకులు, పోలా గురుమూర్తి మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అక్రమంగా ఏఈ రాఘవేంద్రారెడ్డి ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో అడ్డుకున్నామని చెప్పారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అనుమతి లేదు : రవికాంత్ చౌదరి, డిప్యూటీ డీఈ

రుద్రరవం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ పరికరాలు తరించేందుకు అనుమతి లేదు. జూన్ నెల 13వ తేదీ నుంచి సదరు ఏఈ సెలవుపై వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్ రాకేష్‌గౌడ్‌ను ఇన్‌చార్జి ఏఈగా ఉన్నతాధికారులు నియమించారు. పరికరాల తరలింపుపై విద్యుత్ అధికారులు రుద్రరవం పోలీసు స్టేషన్‌ను సంప్రదించారు.